


రెండు కవర్లు వచ్చేయి.

ఒకటి—అక్కయ్య రెండోసారి రాసిన ఉత్తరం తప్పకుండా వోసారి వచ్చి వెళ్లమంటుంది

రెండో కవరు విశ్వం రాసేడు మళ్లీ వోసారి చదువుకున్నాను

''నీకు తెలుసుగా సత్యం మన కథ అంతా వికటంగానే నడిచింది

నేను తొమ్మిదో తరగతిలో వుండగా వొక అప్సరసని చూశాను ఆ అప్సరస—శ్రీలక్ష్మి ఆమెను చూస్తుంటే—వచ్చీరాని వయస్సులో—ఏవేవో వూహలు వచ్చీ రాకుండా వుండేవి. పాలరాతిమీద జార్చిన ముత్యాల్లా వుండేవి ఆ భావాలు

కాలేజీలో వుండగా ఒక పారిజాతాన్ని చూశాను ఆ పారిజాతం—సీత సీతని చూస్తుంటే—ఎదిగిన బుద్ధిలో కోటి దీపాలు వెలిగేవి క్వారీలో పనిచేసిన దేహానికి కొండగాలి సోకినట్లుండేది

ఉద్యోగంలో చేరిన కొత్తలో ఒక సూదంటు రాయిని కలిశాను ఆ సూదంటురాయి పేరు—ఛాయ. ఛాయని చూస్తుంటే ఆడపిల్లల్లో ఆవారాలు క్లోజప్‌లో కనిపించేవాళ్లు హారంలో నీరుదిగిన రాళ్లె కళ్లముందు మెదిలేవి

గౌహతిలో బ్రహ్మనందంగారు — మా బాస్ వాళ్లమ్మాయి, రాణి. ఆ గులాబీ సోయగాన్ని చూసి మనసు చాలాసార్లు ముచ్చటపడుతూ వుండేది—'ఈ పిల్లకి ఇరవై అయిదు నిండేవరకూ నేను పెళ్లి చేసుకోకుండా వేచివుండి—అప్పుడు నేనే ఈమెని చేసుకోవాలి' అని.

వీటిలో ఏ ఒక్కటీ జరగలేదు

ఇప్పటికి—ఇన్నాళ్లకి—నేనూ వో ఇంటివాణ్నవుతున్నాను ! నవ్వుకోకు మరి శుభలేఖ పంపుతున్నాను చూడు పెళ్లికి నీలాంటి పదిమంది పాతమిత్రుల్ని మాత్రమే ఆహ్వానిస్తున్నాను కనుక నువ్ రాక తప్పదు అన్నట్టు—సారథికూడా వస్తాడు ''

శుభలేఖ చూశాను చాలా సింపుల్‌గా వుంది

'మా పెళ్ళి—జూలై 26 రాత్రి 8 గంటలకు తెనాలిలో మా ఇంట్లోనే. మీరు తప్పకుండా రావాలి '

అడ్రసేమో— ఓమూల సన్నగా రెండు లైన్లలో వుంది క్రింద విశ్వనాథం, రోహిణి అని వేసి వుంది ఇద్దరి హోదాలూ మరింత సన్నటి అక్షరాల్లో !

విశ్వనాథం బొంబాయిలో ఏదో కంపెనీలో ఛీఫ్ కెమిస్ట్ రోహిణికూడా అక్కడే బాంక్‌లో ఆఫీసరు!

జూలై 25 రాత్రి—

బస్‌లో కూర్చున్నాను అది ముందుకు సాగింది నేను ఆలోచనల్లో వెనక్కు పోసాగేను

సారథినీ, విశ్వంనీ, నన్నూ కలిపి— 'త్రీ మస్కెటీర్స్' అనేవాళ్లు— మా ముగ్గురితో పరిచయం వున్నవాళ్ళంతా. ఆ రోజుల్లో మాదొక ప్రత్యేకమైన జట్టు ముగ్గురమూ ఖద్దరుపై జమాలాల్చీలతో కాలేజీకి తయారయ్యేవాళ్లం ఒకే గ్రూపు మా ముగ్గురిదీ సభలూ సమావేశాలూ, కాలేజీ కార్యక్రమాలూ, ఆటలు, ఇతర పోటీలూ—

అన్నిట్లోనూ మేమే అంతటా మేమే బహు మతుల్లో ఎక్కువ భాగం మావి

కాలేజీ చదువు కాగానే ముగ్గురమూ విడిపోయాము

ఆ రోజు—

నాకు బాగా గుర్తు తలచుకుంటే విన్న మొన్న జరిగినట్లుంది

కాలవగట్టున నడుచుకుంటూ వెళ్లి కతెవరం వంతెనమీద కూర్చున్నాం ముగ్గురమూ. మేము తరచు సాయంత్రాలూ, రాత్రులూ అక్కడే గడుపుతూ వుండేవాళ్లం.

బాగా చీకటి పడింది. రోడ్డుమీద బస్సులూ, లారీలూ రొద చేస్తూ పోతున్నై దూరంగా అప్పుడప్పుడే లేస్తున్న మా కాలేజ్ భవనం ఆకృతి తోస్తోంది

విశ్వం తన సంగతి మొదలెట్టేడు

'మా అమ్మా నాన్నా పెళ్లి సంగతి ప్రస్తావించి త్వరగా చేసుకోమంటున్నారు నా పెళ్లి గురించి నాకు కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నై మరో సంగతి. నేను ఎమ్మెస్సీ చదవాలి మా అన్నయ్య— కట్నం డబ్బుతో యూనివర్సిటీకిపొమ్మని సలహా ఇస్తున్నాడు నాకది సుతరామూ ఇష్టంలేదు పైగా మా చెల్లి ప్రభ— పెళ్లి కెదిగి కూర్చుంది. ముందుగా నా పెళ్లేమిటి? అందుకని మా అన్నయ్యకి చెప్పేశాను తనకెలాగూ తప్పదని వాడికి నేనంటే ఎంతో ప్రేమ. తన రైల్వే వుద్యోగంతో అప్పో సప్పో చేసి నాకు ఫీజుల వరకూ పంపితే చాలు. భుక్తి సంగతి ఆ తర్వాత చూస్తాను కనుక మనం 'ఛలో వైజాగ్' అంటున్నాం 'అబ్బాయ్' అంటూ ముగించేడు

దీర్ఘంగా నిట్టూర్చి – 'బాగుంది' – అన్నాం నేనూ, సారథీ

సారథి తన సంగతి తానూ చెప్పేడు అతను టీచర్ కాదలచుకున్నాడు

నా గురించి నేనేమీ అనుకోలేదని పొడిపొడిగా సమాధానం చెప్పేను మనస్సులో శతకోటి ఆలోచనలు నాకు.

కళ్ల ముందేమో –

టీ బీ.తో తీసుకుంటున్న నాన్న, నలుగురు చెల్లెళ్లు; కుడి ఎడమల నిండుకున్న అప్పులు, పల్లెలో ఇంకా మా పేరుమీద మిగిలిన నాలుగెకరాల కొండ్రడ, దాన్ని రచ్చకీడ్చి తమకేమీ పెట్టడం లేదని దెప్పిపొడుస్తూ వుండే ఇద్దరు అక్కయ్యలూ!

రాత్రి పది దాటింది భవిష్యత్తుని గురించిన ఆలోచనలతో ముగ్గురమూ ఇంటి మొహం పట్టేము

అదే మేం ముగ్గురమూ చివరిసారిగా కలుసుకొన్నది.

ఆ తర్వాత విశ్వం నుంచీ తరచూ ఉత్తరాలు వస్తూ వుండేవి. అతను ప్రయోజకుడై తన కలలు పండించుకుంటున్నాడని తెలుసుకుని ఆనందిస్తూ వుండేవాణ్ణి. సారథి గురించి మాత్రం ఈ మధ్యలో నాకేమీ తెలియరాలేదు

నేను ఏ జీ ఆఫీసులో ఉద్యోగంలో చేరేను రజనితో పెళ్లి, సంసార జంఝాటం ... అంతా మధ్యమ పురుషుడి మందగమనం!

తెలతెలవారుతూ వుండగా తెనాలి చేరేను

ఇరవై ఏళ్ల తర్వాత నా ఊరులో దిగేను మనస్సు చిత్రమైన అనుభూతికి లోనయింది.

ఊరు పూర్తిగా మారిపోయింది కొత్త బస్స్టాండు కలకలలాడుతోంది కాలవ కట్టలు అటూ ఇటూ పొట్టి గోడల్ని కట్టించుకున్నై రోడ్లు ఎత్తును పెంచుకున్నై. కొత్త కొత్త షాపులూ, టీ బంకులూ వెలసినై నా జరుపేటకేసి సాగిపోయాను

రోహిణి విశ్వంల పెళ్లి నిరాడంబరంగా జరిగింది.

రోహిణికి మా చిన్ననాటి ముచ్చట్ల గురించిచెప్పి చివర్లోఅన్నాను—"నాకు పదిహేడేళ్లఅమ్మాయివుంది. వీడూ నేనూ ఒకే వయసువాళ్లం బహుశా నీకోసం ఇన్నేళ్లు పడిగాపులు పడ్డట్టున్నాడు" రోహిణి నవ్వింది.

"ఏది ఏమైనా ముది బ్రహ్మచారిగా మిగిలిపోకుండా పెళ్లిచేసుకున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది. మీ దాంపత్యం సుఖప్రదంగా సాగాలని ఆకాంక్షిస్తున్నాను."

రోహిణి విశ్వం కళ్లల్లోకి చూస్తూ తనకళ్లు చికిలించింది.

సారథి జవాబిచ్చేడు, "ఆఫీసరైన భార్య దొరకాలంటే ఈమాత్రం ఆలస్యం తప్పదు."

భోజనాలయిన తర్వాత నేనూ, సారథీ వరండాలో మిగిలేం.

నా గురించిన వివరాలు చెబుతూ అతని గురించి అడిగేను.

సారథి చెప్పసాగేడు "నేను టీచర్‌గా స్థిరపడాలనే నిశ్చయంతో వుండేవాణ్ణి—నీకు తెలుసుగా ఉపాధ్యాయ వృత్తిపట్ల నాకున్న గౌరవం అలాంటిది టీచర్‌గా వో కమిటీ స్కూల్లో చేరేను—అతి స్వల్ప కాలంలోనే అక్కడి రాజకీయాలూ, ఈర్ష్యాద్వేషాలూ, క్రమశిక్షణారాహిత్యం—నా కలలని చెరిపేసి ఆదర్శపు టాకాశంనుంచీ నేలమీదకి లాక్కొచ్చినై. అప్పుడే నాకు భగవాన్ తగిలేడు. "డబ్బు" ఆవశ్యకత గురించి అతడు చేసిన ఉపదేశంలో నాకు జ్ఞానోదయమైంది అతనన్న ఒకే వొక్కమాట నా జీవితచక్రాన్ని తిప్పేసింది. అతనన్నాడు, "నలభై ఏళ్లు నువ్ టీచర్‌గిరీ వెలగబెట్టినా, నాలుగురాళ్లు కూడ బెట్టడం—కల్ల ఈ 'చచ్చు' ఉద్యోగాలకంటే పుచ్చు వేరుశనక్కాయలమ్ముకోవడం నయం. నిజం ట్రై చేసి చూడు"


ఎందుకో మనసు ఆవైపు మొగ్గింది విజయవాడకు మకాం మార్చేను. పెళ్లి చేసుకున్నాను మామగారిచ్చిన కొద్దిపాటి పెట్టుబడితో పండ్ల వ్యాపారం మొదలెట్టేను ఏడాది తిరిగేసరికీ నా దుకాణంలో నిమ్మకాయలూ, అరటి ఆకులూ, అరటికాయలూ కూడా చోటు చేసుకున్నాయి పది వేలు కంటబడినై. మరో మార్గం కనబడింది ఉదయాన్నే వందరూపాయలిస్తే సాయంత్రానికి నూటపది వస్తయ్—సన్న సన్న దుకాణాదారులు ఇలా నెట్టుకురావడం నా అనుభవమే నేర్పింది దాన్లో తిప్పేను డబ్బుని మరో మూడేళ్లకి ఈ చిల్లర వ్యాపారమంతా ఎత్తేశాను కోనసీమకు వెళ్లి కొబ్బరి కాయలు బేరంచేసి లారీల కెత్తించటం, విజయవాడకూ, బందరుకూ సరఫరాచేయుటం. అంతే. కమిషన్ వ్యాపారం నేనుగా పైసా పెట్టక్కర్లేదు. ఇచ్చేవాడు వేరు పుచ్చుకునేవాడు వేరు. మరో రెండేళ్లకి వో పాత ఇల్లు కొనుక్కున్నాను—పాతికవేలకి!


భగవాన్ పిలిచేడు. కలసి నాలుగేళ్లు జవుళి వ్యాపారం చేశాము. నా వంతు అరవై వేలు వచ్చిందంటూ ఇచ్చేడు."

సారథి నాకేసి చూసేడు నా నుంచీ అమితమైన ఆశ్చర్యాన్ని ఆశించినట్లున్నాడు

నేను "చెప్పు" అన్నట్టు తలవూపేను.

"ఆ తర్వాత ప్రత్యేకించి చెప్పాల్సిందేం లేదు



ఉన్న నాలుగురాళ్ళూ వడ్డీకి చేతులు మారుస్తూ వుంటాను. భగవానేమో ఏడాదికోసారి నా వాటా నా కిస్తూ వుంటాడు నేను మా పెద్దోడి పేరున న్యూస్ ఏజెన్సీ తీసుకున్నాను దానిమీద రోజూ వో ఎనభై రూపాయలు వస్తాయ్ ''

ఇంతా చెప్పి ''తెగించి ఒక అడుగేశాను. ఆ తర్వాత మన ప్రమేయమూలేదు మన ప్రగల్భమూ లేదు అంతా రంగులరాట్నం ఏదో గడిచిపోతోంది'' అంటూ ముగించాడు

నాకేమో ఓ టెక్నికలర్ సినిమా చూసినట్లుయింది 'సిరిదా వచ్చిన వచ్చును' వగైరా పద్యాలూ చెవుల్లో గింగురుమన్నై

''వెళ్తూ వెళ్తూ వో రోజు విజయవాడలో ఆగు వా మకాన్ ఔర్ దుకాన్ చూసి వెళ్దువుగాని మళ్లీ ఎన్నాళ్ళకి కలుస్తామో ఏమో'' అంటూ ఆహ్వానాన్ని అందించాడు

''అలాగే. వీలైతే తప్పకుండా వస్తా''నన్న హామీనిచ్చాను

సాయంత్రం నాలుగైంది. సారధి సెలవు తీసుకుని వెళ్లిపోయాడు

''ఏంవిటి ఇంకా విశేషాలు ?'' అంటూ నా ఎదుట కూర్చున్నాడు విశ్వం నా గురించి సారథికి చెప్పిందే విశ్వంకీ చెప్పేను ''సారధి ఎంతగా ఎదిగి పోయాడు !'' అంటూ ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాను

విశ్వం నన్నగా నవ్వేడు ''ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే కొన్ని కటువైన నిర్ణయాలు అవసరమే సత్యం నా సంగతి చూడు. నా కాళ్ల మీద నేను నిలబడగలగడమేగాక, జీవితం సాఫీగా, సజావుగా సాగిపోవటానికి అవసరమైన పట్టు చిక్కే వరకూ పెళ్లి చేసుకోకూడదు అని నిర్ణయించుకున్నాను పదహారవ ఏటనే ఆడపిల్లల పట్ల ఆకర్షితుణ్ణాయి, అనేక ఊహాపోహలతో రంగుల కలలు కంటూ వుండే నా వంటి వాడికి నిజానికిఈ నిర్ణయం



పెద్ద చేదు మాత్ర అయినా, అన్ని రకాల ఆకర్షణల్నీ పక్కకి నెట్టి నిలబడ్డాను ఐదు డజన్ల స్పూన్స్ సెట్ నుంచీ— టి. వీ, ఫ్రిజ్ ల వరకూ ఆడంబరమైన సంసార జీవితానికి అవసరమైన ప్రతి ఒక్క వస్తువూ సేకరించి పెట్టుకున్నాను బాంక్ బాలెన్సూ తగినంతగా పెంచుకున్నాను అప్పటికి పెళ్లికూతుళ్ల లిస్ట్ లో ఆర్థికంగా స్థిరపడిన రోహిణి వంటి అమ్మాయి పేరు పక్కనే టిక్ పెట్టుకున్నాను తప్పదు మరి ఇది ఈ యుగ లక్షణం ఆఫ్టరాల్— ప్రవాహంలో తృణకణాలం మనం కొట్టుకుపోకుండా ఏ రాయినో, రప్పనో చెట్టునో గుట్టనో పట్టుకోక తప్పదు అది ఒక్కొక్కపుడు మన నిర్ణయం కావచ్చు మరో వ్యక్తి ఆసరా కావచ్చు.'' ఒక్కక్షణం ఆగి నాకేసి అదోలా చూస్తూ 'ఏమంటావ్ ?' అన్నాడు

నాలోని మధనను ముఖ కవళికల్లో కనపడకుండా చేసుకుంటూ 'అవునవును' అంటూ ఎదురుగా వున్న మేగజైన్ ని చేతిలోకి తీసుకున్నాను

ఆ రాత్రి తొమ్మిదవుతుండగా ఇంటూరు చేరేను నా రాకకు అక్కయ్యా, బావా పిల్లలూ చాలా సంబరపడ్డారు.

మగతనిద్ర నుంచీ లేచి చిన్నపిల్లలు పిచ్చికలల్లే వాలిపోయి అల్లరి మొదలెట్టారు తీసుకు వెళ్లిన మిఠాయి అందించాను

''అబ్బ పూస మిఠాయి తిని ఎన్నాళ్లయిందో—'' అంది కామేశ్వరి ఆబగా పొట్లం విప్పి గుప్పెటతో పలుకులు నోట్లో వేసుకుంది

గడియారంలో ఒక చక్రం సమంగా, క్రమంగా తిరుగుతూ వుండాలంటే, మిగిలిన చక్రాలన్నీ పనిచేస్తూ వుండాలి మా అక్కయ్య సంసారంలో చాలా నట్లు వదులుగా వుండటం మాట అటుంచి, ఒక పెద్ద చక్రమే నత్త నడక నడుస్తూ వుంది ఆ చక్రం మా బావ ఆయన శిథిలమైపోయిన అగ్రహారీకుల పురా ప్రాభవానికి వారసుడు చదివిన వైదీకపు ముక్కలు తన పొట్ట నింపగలవేమోకాని, పెళ్లామూ నలుగురు పిల్లల పొట్టలు నింపవు పోయింది పోగా మిగిలిన ఒక ఎకరం మాగాణీలో వచ్చే గింజలు ఒక పూట గ్రాసానికే అంతంత మాత్రం ఇల్లు, ఇంటికి పట్టిన బూజూ— ఆచార వ్యవహారాల పట్ల వారికున్న నమ్మకాలకి అడ్డంపడుతూఉంటాయి. అన్ని రాజసాలూ అంతకు ముందు తరంతోనే అంతరించిపోయినా— భేషజాలకు మాత్రం కొదువలేదు ఆ భేషజమే మా అక్కయ్య సంసారాన్ని ఎదుగూ బొదుగూ లేకుండా 'గొంగళి' సామెతగా మార్చింది ఆ భేషజమే—ఆరుప్రాణాల్నీ నెలకు వారంరోజులయినా రాత్రుళ్ళ అభోజనం చేయిస్తుంది ఊళ్లోవాళ్లు మాత్రం 'సుందరమ్మ మానానికి మగ్గేతల్లి ! కూటికి లేకపోయినా కొండంత అభిమానం ఆమెకు' అంటారు ''ఉంటే తింటారు, లేకపోతే పస్తుంటారు గానీ ఆ సుందర్రావూ కుటుంబం గడపదాటి రారు'' అని మా బావకీ కితాబు వుంది

దోర వెన్నెల్లో—ఇంటి ముంగిట పడుకున్నాం. చుక్కల చీరని చాందినీగా కట్టించుకుంది ఆకాశం

అక్కయ్య మంచినీళ్ల చెంబు తెచ్చి మంచం కిందపెట్టింది తన మంచంమీద కూర్చుని చెప్ప సాగింది

''పల్లెటూళ్లలో బతకడం మరీ కష్టంగా వుందిరా సత్యం నీ చిన్నప్పుడు తెలుసుగా సావిత్రమ్మ గారింటికి పోయి మజ్జిగ కావాలి అత్తయ్యా అంటే తప్పేళా నిండుగా కవ్వంకింది చల్లపోసి యిచ్చేది ఇవ్వాళ ఈ వూళ్లో పాలు దొరకవు, తాగేనీళ్ళు దొరకవు—మిగిలిన దినుసుల సంగతి చెప్పేదేముంది



# కళ్లు చెదరే తెల్లదనంకోసం పాల్ డిటర్జెంట్ సబ్బు బిళ్ల




తెల్ల బట్టలు కళ్లు మిరుమిట్లు గొలిపే తెలుపు తేవడమే కాదు—పాల్ డిటర్జెంట్ సబ్బు బిళ్ల మీ రంగు బట్టలు ఉతకడానికీ పనికి వస్తుంది

వాడుకలో సౌకర్యం, లాభం తెచ్చే పాల్ డిటర్జెంట్ సబ్బు బిళ్ల - ప్రతి విషయాన్ని ప్రత్యేకంగా చూసే గృహిణుల తొలి ఎన్నిక అనాలి.

నిజమైన తెల్లదనానికి పాల్ డిటర్జెంట్ సబ్బు బిళ్ల.

**అల్ట్రా మెరైన్ అండ్ పిగ్మెంట్సు లిమిటెడ్**
రాణిపేట-642 403 తమిళనాడు


## చక్రనేమిక్రమం

మీ బావేమో ఈ ఊరు మార్చరు, మా పరిస్థితీ మారదు ఎన్నేళ్లుపోయినా—దినదినగండం నూరేళ్లాయుష్షుగానే వుంది తిండికీ, కట్టుకుంటానికి సరైన చీరాలేక మురికిపోడుతూ వుండటమూ తప్పటంలేదు''

నా మనసు జలదరించింది చీకటి చీకటిగ వుంది కళ్లముందు

కొద్దిక్షణాల తరువాత—మళ్లీ మొదలెట్టింది అక్కయ్య ''కామేశ్వరికి వచ్చే మాఘమాసంలో పెళ్లి చేద్దామనుకుంటున్నాం''

నా పక్కన పిడుగుపడినట్లు అదిరిపడ్డాను

''నరసింహశర్మగారు అదేరా మీ బావగారి గురువుగారు ఆయన—రజస్వలా కాకమునుపే పిల్ల దానికి మూడుముళ్లూ వేయించమంటున్నారుట మా తోడికోడలు తమ్ముడున్నాడులే ఎక్కడో బస్సుల్లో పనిచేస్తున్నాట్ట వాడికిద్దామని''

ఆ తర్వాత ప్రత్యేకంగా వినవలసిందీ లేదు పెళ్లిఖర్చు రెండువేలూ నేను సహాయం చేయాలి

నా మేధస్సులో కోటి ప్రశ్నలు

''సూర్యుడులేదు ఉదయం ఎలా వస్తుంది?''

రోహిణీ, సారధీ రూపాలు నా కళ్లముందు మెదిలినై

వాళ్లఆదర్శాలానూ, ఆచరణలనూ కామేశ్వరితో, మా బావతో పోల్చుకోవడానికి ప్రయత్నించింది మనస్సు

''తెగించి ఒక అడుగేశాను'' సారధి మాటలు గుర్తుకొచ్చినై. కానీ మా అక్కా బావ? —

తమ చుట్టూ తాము మూడు గీతలు గీసుకుని కూర్చున్నారు ఆ వలయాల్లో క్షణ క్షణం తమను తామే అణుక్కు నెట్టుకుంటూ పాతాళందాకా కూరుకుపోయారు అందుకనే వాళ్ల చేతులు ఎన్నడూ పై అంచును అందుకోలేవు

ఆలోచనలతో నిద్ర పట్టింది.

మర్నాడు — ఇంటికి తిరిగి వచ్చేశాను

* * *

ఆరునెలల తర్వాత —

రెండు కవర్లు వచ్చేయి

ఒకటి — ఇంటూరునుంచీ శుభలేఖ కామేశ్వరి పెళ్లి శ్రీరస్తు శుభమస్తు నుంచీ 'జానక్యాః కమలాంజలి పుటే' మీదుగా ఓం తత్ సత్ మంగళం మహాశ్రీ — వరకూ వుంది.

రెండో కవరు విశ్వం రాశాడు — బొంబాయి నుంచీ రోహిణి అతనికి విడాకుల నోటీసిచ్చిందట! అతని అహంకారాన్ని ఆమె భరించలేదట! సారధి దగ్గర అప్పు తీసుకున్న వాడెవడో అతని తలబద్దలు కొట్టాడట అతనిప్పుడు హాస్పిటల్‌లో వున్నాడట. ఇదీ సారాంశం.

''జీవితం ఏమిటి ?'' ప్రశ్న అయితే

''మారని ఋతువుకీ, మారుతున్న విలువలకీ భాష్యం చెప్పలేని వేదాంతి నవ్వు'' — సమాధానం కాబోలు !!

గడియారం పన్నెండుగంటలు కొట్టింది !!! ★